శ్రీ కొడవటిగంటి కుటుంబరావు.



# అసలు మాది కిష్కింధ!

మావూరి కోతి వచ్చింది. ఓరోజు పొద్దున్నే మావూరి పిల్లకాయలు దాన్ని ఆంజనేయస్వామి ఆలయంగోడమీద చూశారు. అది పేలకోసం వెతుక్కుంటుంటే నవ్వారు. కాని అది కనిబొమలు పైకెత్తి నుదురు ముడతలుపడి దీర్ఘాలోచనలో ఉన్నప్పుడు పిల్లకాయలకి ఆశ్చర్యంవేసింది.

పెద్దవాళ్లు జోక్యం కలిగించుకోకబోతే కోతి ఏమయిఉండేదో మరి. పిల్లకాయలు కోతినిచూసి గంటసేపైనా ఆనందించారో లేదో ఈలోపుగా ఆదారినేపోతూ, పురాణంచెప్పే శాస్తుల్లుగారు గుడిముందాగి, “మనోజవంమారుతతుల్యవేగం... శ్రీరామదూతం శిరసానమామి” అంటూ ఏదో గొణగసాగాడు. కోతి కాస్తా ఆయన కెదురుగా వచ్చి నుంచుని కిచకిచలాడింది.

సాయంకాలానికల్లా కోతి మావూరికి అతిథి అయిపోయింది. రామకోటి రెండోసారి రాస్తున్న రామదాసుగారూ, ఆమధ్యనే చచ్చిబతికిన గుప్తగారూ, పురాణంచెప్పే శాస్తుల్లుగారూ, హనుమదుపాసిగారీశంకర పార్వతీ పరమేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర్లుగారూ వగైరాలంతా కోతికి భక్తులయి నారు.

పిల్లలు పుట్టనివాళ్ళూ, పిల్లలుదక్కనివాళ్ళూ పొద్దుపోని వితంతువులూ వగైరాలు ఆరోకాలం కింద తయారయింది.

కోతి కలిసొచ్చిందని పుకారుపుట్టింది. కోతి వచ్చిన తరవాత మావూరికి కలరా రాలేదు, మావూళ్ళో ఇళ్లేవీ కాలలేదు, మావూరికి ఉప్పెనకూడా రాలేదు. (మావూరికి సముద్రం పాతికమైళ్ళదూరము ఉంటే ఏం? మాతాత అయిదేళ్ళవాడై ఉండగా వచ్చిన బందరుగాలివానకి వరదవచ్చి మావూరి బయటవున్న తాళ్లెక్కితే అంతదూరాన స్పష్టంగా కనిపించిందట. ఇది మాతాత స్వయంగా చూసిన విషయం!)

కోతి బలిసింది మరి. అది ఏ ఇంట్లో జొరబడి అందిన ఆహారం పుచ్చుకోవటానికైనా హక్కుంది. మా వూరికి పురపాలకసంఘంలేదు గాని ఉంటే ఈ హక్కు తీర్మానరూపంలో ఇవ్వబడి ఉండేదే.

బీదలూ, సాదలూ, అలగా జనమూ చాటు బాటున కోతిని కొడుతున్నట్టు ఊళ్ళో తెలియగానే ఊరంతా అట్టుడికిపోవటమేగాక ఊళ్లో పౌర సభకూడా ఒకటి జరిపి అందులో కోతినికొట్టిన

వాళ్ళమీద భయంకర నిరసన తీర్మానంకూడా చెయ్యబడింది.

క్రమంగా కోతి తనబలం తెలుసుకోసాగింది. అది మొదట్లో చిన్నపిల్లల్నిమాత్రమే భయపెట్టుతూ ఉండేది. రానురాను అది పెద్దవాళ్ళనుకూడా భయపెట్టసాగింది. ఎటువంటి విచక్షణా లేకుండా అందర్నీ అటకాయించి పిలకలూ వగైరా పీకసాగింది.

కోతికోపం వచ్చింది. ఉపశాంతికోసం ఓ యజ్ఞమో సప్తాహమో చేతామనుకున్నారు. మావూరి కోటయ్యశ్రేష్టి, యగ్గానికి కావలసిన వస్తువులన్నీ తను సరఫరాచేసే షరతుమీద ఓ వందచందాకూడా వేస్తానన్నాడు. కాని అది పడలేదు. చందాలు బాగా పోగుకాలేదు.

ఆఖరుకు ఊరిబయట మరోపౌరసభ జరిగింది. అందులో కోతి ఊరికి హానికరమని దాన్ని వదిలించేటందుకు సాంఘిక సేవకులంతా నడుములు కట్టుకోవలసిందని తీర్మానం జరిగింది.

ఈ సభకు వెనుక కమ్యూనిస్టులున్నట్టు వదంతి పుట్టింది. వెంటనే ఊళ్ళో మరోసభచేసి పెద్దలు, కోతిమీద కుట్ర చేస్తున్నందుకు కమ్యూనిస్టుల మీద ఒక నిరసన తీర్మానం చేశారు. ఈ తీర్మానానికి వోటు చెయ్యటానికి కిసానుపార్టీని, కాంగ్రెసుపార్టీలనూ, హిందూమహాసభనూ, జస్టిసు పార్టీనీ, ఇంకా తదితర హంగులను సభ కాహ్వానించారు.

కోతి యథాప్రకారం స్వైరవిహారం చేస్తున్నది.



శ్రీమతి రాగిణి

ఓనాడు షేక్ మస్తాన్ గుడిపక్కగా ఖాళీ ఒంటెద్దు బండితోలుకుపోతూ పురాణంచెప్పే శాస్త్రుల్లుగార్ని చూసి, "కోతీ మాచెడ్డా గడ్బడ్ గాహుంది, చాస్త్రుల్లుగారూ! అన్నాడు.

"ఆకమ్యూనిస్టులు నీకేమన్నా గడ్డి పెడుతున్నారా ఏం? వాళ్ళమాటవిని మాదేముణ్ణి తిడితే నీకు పాకిస్తానిస్తామనుకున్నావు గామాలు?" అన్నాడు శాస్త్రుల్లుగారు నిప్పులు కక్కుతూ.

"ఈ కాబోతే ముడ్డీకిందయేసుకూర్కోండి, మారాజ్!" అంటూ మస్తాన్ ఎద్దునదిలించాడు.

ఇంతట అకస్మాత్తుగా కోతి మాయమైంది. మళ్లీ పౌరసభ జరిగింది. కోతిని మాయంచేసినవాళ్ళమీద నిరసన తీర్మానం చేయబడింది.

కోతిని మాయంచేసింది కమ్యూనిస్టులే అనే తీర్మానం ప్రతిపాదించి, బలపరిచి క్షణంలో నెగ్గించారు. మావూరిపంతులు మాట్లాడుతూ కమ్యూ

నిస్టులవల్ల మావూరికి జరుగుతున్న అపచారాలను గురించి ఉపన్యసించి నిర్మాణ కార్యక్రమంగురించి అరగంటసేపు చెప్పి కూచున్నాడు.

కోతి మాలపల్లి చేరగా అక్కడ పోలిగాడు వగైరాలు దాన్ని పట్టుకుని బస్తీకి తీసుకుపోయి అక్కడక్కడ నడుస్తున్న సర్కసువాళ్ళ కమ్మినట్టు వదంతిగా ఉన్నదని ఎవరో లేచి అన్నారు.

వెంటనే సభాధ్యక్షుడు లేచి ఇటువంటి దుర్వార్తలు పుట్టిస్తున్నది కమ్యూనిస్టులేనని, మావూరి పౌరులు హరిజనులమీద ఇటువంటి నిందలు ప్రచారం చెయ్యటం ద్రోహమనీ అన్నాడు.

మావూరి పంతులు మళ్లా లేచి హరిజనోద్ధరణ మీద మరో అరగంట మాట్లాడాడు. హరిజనుల్లో కూడా ఇప్పుడిప్పుడు కొందరు కమ్యూనిస్టులమాటలువిని చెడిపోతూ ఉన్నట్టు తెలిసి తన హృదయం దహించుకుపోతున్నదన్నాడు.

అప్పటికే కాలాతీతమైనప్పటికీ, హరిజనులను చెడగొట్టుతున్నందుకు కమ్యూనిస్టుల్ని నిరసించుతూ ఒక పెద్దతీర్మానం చెయ్యబడింది.

నేను రహస్యంగా అధ్యక్షుడితో, "కోతిని వెతికి పట్టుకొచ్చేటందుకొక తీర్మానంచేసి దానికిగాను చందాలు వసూలుచేస్తే ఏం?" అన్నాను.

"కాలాతీతమైపోయింది," అన్నాడధ్యక్షుడు.

1945 మార్చి

క్రొత్త రకాలు! క్రొత్త పోకడ!

స్వచ్ఛమైన బంగారు కావలసినప్పుడు
సొమ్ము చేసుకొనవచ్చును.



ఈ నగలు బంగారు గిల్టువేసినవి కావు. లోపల లోహపు కడ్డీమీద బంగారు రేకు తొడగబడియుంది. కొద్ది ఖరీదుకే ఎక్కువ నగలొస్తాయి.

మా ఖాతాదారులందరు మా టి. సి. యన్. గోల్డుమెటల్ నగలు కొన్ని సంవత్సరాలయిన తరువాత కాంతి తగ్గుచున్నవి. అట్లు లేకుండా చేయవలసినదని వ్రాసిన లేఖలకు - మేము గ్యారంటీ రకాలను ప్రచారంలోకి పెట్టుతున్నాము.

ఉంగరము ఒకటికి రూ. 10–0–0. వి. పి. ఛార్జీ 0–10–0.

| | |
|---|---|
| పెద్దసైజు గాజులు 2 అంగుళములు మొదలు పైబడినవి జత 1-8 | రూ. 20-0-0 |
| మధ్యసైజు గాజులు 1¾ అంగుళములనుండి 2 అంగుళములకులోపల జత 1-8 | రూ. 15-0-0 |
| బేబీ సైజు గాజులు 1¾ అంగుళములకు లోపల జత 1-8 | రూ. 10-0-0 |
| వి. పి. ఛార్జీలు | రూ. 0-10-0 |



టి. సి. నాగలింగప్ప అండ్ కో.,

280, వాల్‌టాక్సురోడ్, పి. టి., మద్రాసు.

ఏజంటు: శ్రీ కె. యన్. తిమ్మప్పశెట్టిగారు, గోపువారి బిల్డింగ్సు, బెజవాడ.